అయ్యప్ప స్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌కు అయ్యప్ప స్వామి ప్రసాదం అందజేస్తున్న మాలధారులు

కురవి, డిసెంబర్ 18: అయ్యప్ప స్వామి ఆశీస్సులు తెలంగాణ ప్రజలందరిపై ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. కురవి వీరభద్రస్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారులకు నిర్వహించనున్న మహా అన్నదాన కార్యక్రమానికి సోమవారం మహబూబాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో రూ.10వేల సాయం అందజేశారు. మహబూబాబాద్ నుంచి శబరిమలకు మహాపాదయాత్ర చేస్తున్న మాలధారులు సంగెం నాగరాజు, వేమిశెట్టి సంతోష్, కన్నెం గురుమూర్తి, రాకేశ్‌తో ఎమ్మెల్సీ సత్యవతి ఫోన్‌లో మాట్లాడారు. పాదయాత్ర క్షేమంగా సాగాలని, ఈ ప్రాంతం ప్రజలందరి తరపున అయ్యప్ప స్వామికి మొక్కులు చెల్లించాలని కోరారు. అనంతరం అయ్యప్ప స్వామి ప్రసాదాన్ని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌కు గురు స్వాములు బాదె నాగన్న, ఐలి నరహరి అందజేశారు.

నట్టల నివారణ మందు అందిస్తున్న పశువైద్యాధికారి రాజశేఖర్

పశువుల ఆరోగ్య రక్షణ ముఖ్యం

- సీజన్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలి
- పశువైద్యాధికారి రాజశేఖర్

పెద్దవంగర, డిసెంబర్18: పశువుల ఆరోగ్య సంరక్షణ ఎంతో ముఖ్యమని పశువైద్యాధికారి డాక్టర్ బీ రాజశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని బొమ్మకల్లు గ్రామంలో పశుసంవర్ధకశాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించి మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్య శిబిరాలు, వ్యాధి నిరోధక టీకాలు, సేవలను తప్పక వినియోగించుకోవాలన్నారు. సీజన్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలి సూచించారు. అనంతరం పాడి రైతులకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకట్రామయ్య, గోపాలమిత్ర సూపర్‌వైజర్ ఎం అనిల్, పశువైద్య సిబ్బంది ఎల్లయ్య, యాకూబ్‌పాషా, మురళీకృష్ణ, రైతులు రామ్మూర్తి, సమ్మయ్య, శ్రీను పాల్గొన్నారు.

కేయూకు మరో కీర్తికిరీటం

- ప్రపంచంలోనే 600వ అత్యంత స్థిరమైన విశ్వవిద్యాలయంగా ర్యాంకు
- దేశంలో 29వ స్థానం, రాష్ట్రంలో మొదటి స్థానం
- కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు వెల్లడి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 18: కేయూ కీర్తికిరీటంలో మరో మణిహారం చేరింది. '2023 యూఐ గ్రీన్ మెట్రిక్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్'లో తెలంగాణ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. యూఐ గ్రీన్ మెట్రిక్‌లో ప్రపంచస్థాయి యూనివర్సిటీల్లో కేయూ 600వ స్థానం, దేశంలోని విశ్వవిద్యాలయాల్లో 29వ స్థానం, తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో మొదటి స్థానం, తెలుగు రాష్ట్రాల విశ్వవిద్యాలయాల్లో 2వ స్థానంలో నిలిచి సత్తా చాటింది. దీనికి సంబంధించిన సర్టిఫికెట్ యూఐ గ్రీన్ మెట్రిక్ చైర్‌పర్సన్ నుంచి మెయిల్‌లో అందినట్లు రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కేయూ ప్రపంచస్థాయి 600వ అత్యంత స్థిరమైన విశ్వవిద్యాలయంగా ర్యాంకు పొందిందని, పర్యావరణ సుస్థిరత, బాధ్యతాయుతమైన క్యాంపస్ నిర్వహణపై విశ్వవిద్యాలయం దృష్టి సారించిన ప్రయత్నాలకు ఇది నిదర్శనమన్నారు. జాతీయంగా విశ్వవిద్యాలయం దేశంలో 29వ స్థానంలో ఉందని, దేశంలో హరిత కార్యక్రమాలు, స్థిరమైన అభ్యాసాలను ప్రోత్సహించడంలో ముందున్నట్లు గ్రీన్ మెట్రిక్‌లో విశ్వవిద్యాలయం ర్యాంకింగ్, వివిధ కోణాల్లో దాని స్థిరత్వ పద్ధతుల సమగ్ర అంచనాపై ఆధారపడి ఉంటుందని, ఈ రంగాలకు కేయూ నిబద్ధతతో ఉన్నత ర్యాంకింగ్‌లో ఉందని, వివిధ అంశాలు.. ముఖ్యంగా మౌలిక వసతులు, పర్యావరణం, వ్యర్థాల నిర్వహణ, అవస్థాపన సౌకర్యాలు, రవాణా వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ర్యాంకింగ్ ఎంపిక ఉంటుందన్నారు.

మహబూబాబాద్ రూరల్: సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు, పాల్గొన్న భక్తులు

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

డోర్నకల్: సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 18: మండలంలోని శనిగపురం గ్రామంలో కోదండ రామాలయంలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణాన్ని సోమవారం ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి అందరూ ఆనందంగా ఉండాలని వేడుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అనిల్ కిరణ్ కుమార్ దంపతులు, రామ్మోహన్‌రెడ్డి, రాంశెట్టి వీరేందర్, బోడ్ల మధుసూదనరావు, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, ఉపేంద్రమ్మ, భిక్షపతి, శ్రీను, మనోజ్, యాకన్న, కొమురమ్మ పాల్గొన్నారు.

డోర్నకల్‌లో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి వేడుకలు

డోర్నకల్: తోడేళ్లగూడెం గ్రామ శివారులోని కోతుల గుట్ట వద్ద వల్లి సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి వేడుకలను సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. నాలుగు జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల కోసం కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

దంతాలపల్లి, డిసెంబర్ 18: మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు ఇటీవల బదిలీలపై వివిధ ప్రాంతాలకు వెళ్లగా, సోమవారం వారికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. బదిలీపై వెళ్లిన హెచ్ఎం శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. అదేవిధంగా బదిలీపై పాఠశాలకు వచ్చిన హెచ్ఎం వేణుమాధవ్, ఉపాధ్యాయులను సన్మానించి ఘన స్వాగతం ఫలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నీటి కోసం ఏకలవ్య విద్యార్థుల అవస్థలు

బయ్యారం, డిసెంబర్ 19: మండల పరిధి నామాలపాడులోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థినుల అవసరాలకు నీరు లేకపోవడంతో ఐదు రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలో సుమారు 240 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా సరైన నీటి సౌకర్యం లేక వారి పూర్తి అవసరాల కోసం మిషన్ భగీరథ నీటిని వాడుతున్నారు. భగీరథ నీరు సరిపోని సమయంలో పంచాయతీ ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా నీటిని తెప్పించి వాడుతున్నారు. ఈ క్రమంలో ఐదు రోజుల నుంచి విద్యార్థినులు స్నానాలతో పాటు, ఇతర అవసరాలకు ఇబ్బంది పడుతున్నారు. వారి సమస్యను సర్పంచ్‌కు తెలియజేసినా పట్టించుకోలేదని ప్రిన్సిపాల్ రవిబాబు తెలిపారు. అనంతరం ఎంపీడీవో సత్యనారాయణరెడ్డికి ప్రిన్సిపాల్ విషయం తెలుపడంతో సమీప కొత్తపేట, సంతులాల్ పోడ్ తండా గ్రామ పంచాయతీలకు చెందిన ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి సమస్యను పరిష్కరించి విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూశారు. అయితే పాఠశాలలో తరచూ నీటి సమస్య తలెత్తుతుండడంతో విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని విద్యార్థినులు కోరుతున్నారు.

నీటి కోసం ట్యాంకర్ వద్ద బారులు తీరిన ఏకలవ్య పాఠశాల విద్యార్థినులు

'ప్రజావాణి' వినతులను వెంటనే పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 18: ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ కే శశాంక అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలనుంచి ఆయన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కువగా పోడు భూముల పట్టా పాసు పుస్తకం ఉండి కూడా రైతుబంధు రావడం లేదని, అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. డోర్నకల్ మండలంలోని అన్నారం గ్రామ పంచాయతీ హైవే రోడ్డు కోసం స్థలం పోయినా నష్టం పరిహారం అందలేదని ప్రజల నుంచి దరఖాస్తులు వచ్చాయని, సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 50 దరఖాస్తులు వచ్చావని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో అలివేలు

ఓటరు జాబితాను అప్‌డేట్ చేయాలి

నెల్లికుదురు, డిసెంబర్ 18: త్వరలో జరగనున్న ఎన్నికలకు ఓటరు జాబితాను అప్‌డేట్ చేయాలని మహబూబాబాద్ ఆర్డీవో అలివేలు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. మండలంలో మొత్తం ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి? ఇంకా ఏమైనా కొత్తగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉన్నదా? మండల ఓటర్ల సంఖ్య తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా ఓటు నమోదు ప్రక్రియపై ఆరా తీశారు. ఓటరు నమోదు, అప్‌డేట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పరకాల, డిసెంబర్ 18: ద్విచక్ర వాహనం పైనుంచి పడి యువకుడు మృతి చెందిన ఘటన నాగారంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కంచె కృష్ణ(25) ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బైక్‌పై పరకాలకు వచ్చాడు. పనులు ముగించుకొని తిరిగి అర్ధరాత్రి సమయంలో నాగారం గ్రామానికి వెళ్తుండగా పట్టణ శివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయాడు. సోమవారం ఉదయం స్థానికులు గమనించి కృష్ణ తండ్రి రవీందర్‌కు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని కృష్ణను పరకాలలోని దవాఖానకు తరలించారు. అతడిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

నర్సంపేటరూరల్: తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన నర్సంపేట పట్టణంలోని పాకాల రోడ్‌లో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని పాకాలరోడ్‌కు చెందిన తాళ్ల చంద్రశేఖర్(53) ములుగు జిల్లా జంగాలపల్లిలోని రైస్ మిల్లులో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 6న మిల్లులో పని ముగించుకొని బైక్‌పై ఇంటికి వస్తుండగా ఇటుకాలపల్లి శివారులోని హైవేపై ఆరబోసిన ధాన్యం రాశులను తప్పించే క్రమంలో అదుపుతప్పి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను సిద్దిపేటలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ చంద్రశేఖర్ మృతి చెందాడు. అతడి సోదరుడు తాళ్ల చిన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శీలం రవి తెలిపారు.